
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 34.0

కనిష్ఠం : 25.0

ఆ కోళ్లు బర్డ్‌ఫ్లూతోనే చనిపోయాయి



బర్డ్ ఫ్లూ కారణంగా ఫౌల్ట్రీ ఫారంలో చనిపోయిన కోళ్లు (ఇన్‌సెట్‌లో) పూడ్చిపెడుతున్న దృశ్యం (ఫైల్)

- భోపాల్ ల్యాబ్‌కు కానూరు, వేల్పూరు బాదంపూడి పౌల్ట్రీల్లోని కోళ్ల నమూనాలు.. పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ చేసిన నిపుణులు
- కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి అధికారిక సమాచారం.. జీవో నెంబరు 122 జారీ


తణుకు రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు పౌల్ట్రీ ఫారాల్లో కోళ్ల బర్డ్‌ఫ్లూ వల్లే చనిపోయినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక సమాచారం వచ్చింది. ఇదే విషయాన్ని గెజిట్‌లో ప్రచురించి సదరు కోళ్లు చనిపోయిన ఫారాల నుంచి కిలోమీటరు వరకు ఇన్‌ఫెక్టెడ్ జోన్‌గా, పది కిలోమీటర్ల పరిధిని సర్వైలెన్స్ జోన్‌గా ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 10న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరులోని పౌల్ట్రీ ఫారంలోను, 11న పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరు కృష్ణానందం పౌల్ట్రీ ఫారంలోను, 13న ఉంగుటూరు మండలం బాదంపూడి పౌల్ట్రీ ఫారంలోను వేలాది కోళ్లు చనిపోయాయి. ఇవన్నీ బర్డ్‌ఫ్లూతోనే చనిపోయాయని భావించినప్పటికీ అధికారికంగా నిర్ధారణ అయ్యే వరకు చెప్పలేమని అప్పట్లో అధికారులు ప్రకటించారు. అయితే ముందు జాగ్రత్త చర్యగా కోళ్లను పూడ్చిపెట్టడంతోపాటు పరిసర ప్రాంతాలను నిషిద్ధ ప్రాంతాలుగా ప్రకటించి ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. చనిపోయిన కోళ్ల శాంపిల్స్‌ను భోపాల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైసెక్యూరిటీ యానిమల్ డిసీజస్‌కు పంపగా ఈ కోళ్ల ఫారాల్లో చనిపోయిన కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. ఇదే విషయాన్ని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. దీంతో ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ ఇన్ఫెక్షియస్ అండ్ కంటాజియస్ డిసీజెస్ ఇన్ యానిమల్స్ యాక్ట్ కింద కానూరు, వేల్పూరు, బాదంపూడిల్లోని బర్డ్‌ఫ్లూ ప్రభావిత కోళ్ల ఫారాల నుంచి కిలోమీటరు వరకు ఉన్న పరిధిని ఇన్‌ఫెక్టెడ్ జోన్‌గా, పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాలను సర్వైలెన్స్ జోన్‌లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రాంతాల నుంచి కోళ్లను ఇతర ప్రాంతాలకు రవాణా చేయడంపై ఆంక్షలు అమలు చేయాలని సూచించారు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం జీవో నెం.122 జారీ చేశారు. అయితే అధికార యంత్రాంగం ఇప్పటికే ముందు జాగ్రత్తలు తీసుకున్నందున ఈ ఆదేశాలు అమలు చేస్తారా ? లేదా ? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

పెరిగిన వినియోగం

బర్డ్ ఫ్లూ ప్రభావంతో ఫిబ్రవరిలో 22 రోజులపాటు అలెర్ట్ జోన్ పరిధిలోని తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో చికెన్, కోడి గుడ్ల అమ్మకాలు, వినియోగం నిలిచిపో యింది. దీనితో చికెన్, గుడ్ల సంబంధిత రంగాలు మూసివేశారు. తిరిగి మార్చి ఒకటి నుంచి చికెన్, ఎగ్ మేళాలను నిర్వహించి చికెన్, కోడి గుడ్ల వినియోగంపై ప్రజలలో అవగాహన కల్పించారు. ఇప్పుడిప్పుడే చికెన్ అమ్మకాలు గాడిన పడి వ్యాపారాలు సాగుతున్నాయనే ధీమాలో చికెన్, కోడి గుడ్ల వ్యాపారులతోపాటు చికెన్ పలావ్, పకోడి వ్యాపారులు ఉన్నారు.

11న సీఎం పర్యటన

- ఇంకా ఖరారు కాని టూర్ షెడ్యూల్



నూజివీడు టౌన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 11న నూజివీడు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. అధికారికంగా నియోజకవర్గంలో ఏ గ్రామంలో పర్యటించనున్నది ఇంకా నిర్ణయం కాకపోయినా నూజివీడు మండలం బత్తులవారిగూడెం, ముసునూరి మండలం కాట్రేనిపాడు, ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామాల్లో ఏదో ఒక గ్రామం లో పర్యటించనున్నట్లు తెలుస్తుంది. పీ-4 గ్రామాలైన వీటిపై అధికారులు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తుంది.

రెండో రోజు జేఈఈ మెయిన్

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జేఈఈ మెయిన్ రెండో రోజు గురువారం ప్రశాంతంగా సాగాయి. భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో ఉదయం పరీక్షకు 91 మంది, సాయంత్రం 95, తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 42, సాయంత్రం 62, పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 175, సాయంత్రం 176 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశారు.

ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో

సీటీ స్కాన్



నెల రోజుల తర్వాత అందుబాటులోకి..

7



ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం ఇబ్రహీంపేటలో కురుస్తున్న వర్షం

ఇబ్రహీంపేటలో వర్షం

- మిర్చి రైతుల్లో ఆందోళన

కుక్కునూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట, తొండిపాక గ్రామాల్లో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. వేసవితాపంతో అల్లాడుతున్న ప్రజలకు కొంతవరకు ఉపశమనం లభించింది. తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈక్రమంలో ఆ ప్రభావం మండలంపై చూపించింది. గురువారం రాత్రికి, శుక్రవారం మండలంలోని కొన్ని గ్రామాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు తెలిపారు. దీంతో మిర్చి రైతులు అప్రమత్తమయ్యారు. కల్లాల్లో వందలాది క్వింటాళ్ల మిర్చి ఉంది. ఆ మిర్చినంతా కుప్పలుగా పోసి టార్పాలిన్లు కప్పుతున్నారు. ఇబ్రహీంపేట గ్రామంలో స్వల్పంగా కురిసిన వర్షానికి మిర్చి తడిచినట్టు రైతులు చెబుతున్నారు.

తాగే నీరు సురక్షితమేనా ?

కలుషితమవుతున్న కాల్వలు, తాగునీటి చెరువులు

6

నేటి నుంచి ‘టెన్త్’ మూల్యాంకనం

- ఏడు రోజులపాటు లక్షా 80 వేల జవాబు పత్రాల వాల్యుయేషన్
- వీరవాసరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 850 మంది ఉపాధ్యాయులు హాజరు
- అన్ని ఏర్పాట్లు చేశాం.. డీఈవో నారాయణ

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు గత నెల 17న ప్రారంభమై ఈనెల ఒకటో తేదీతో ముగిశాయి. ఆ పరీక్షల వాల్యూయేషన్ శుక్రవారం నుంచి మొదలు కానుంది. పశ్చిమ గోదావరి జిల్లాలో వీరవాసరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పరీక్ష పేపర్ల మూల్యాంకనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక జిల్లా ఏర్పడిన నాటినుంచి పరీక్ష పేపర్ల మూల్యాంకనానికి ఈ పాఠశాలనే వినియోగిస్తున్నారు. జిల్లా ప్రధాన కేంద్రం సమీపంలోనే మూల్యాంకనం చేయాల్సి ఉండగా అన్ని సౌకర్యా లతో కూడిన విధంగా వీరవాసరం పాఠశాల ఉండడంతో జిల్లా విద్యాశాఖ ఈ పాఠశాలనే ఎంపిక చేసుకుంది. ఈ ఏడాది కూడా 25 గదులలో, లక్షా 80 వేల జవాబు పత్రాలను 850 మంది ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయనున్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఏడు రోజుల పాటు ఈ పరీక్ష పత్రాల వాల్యూ యేషన్ జరిగే విధంగా ఏర్పాట్లు చేశారు. సిబ్బందికి అవసరమైన విద్యుత్తు, మంచినీరు, టాయిలెట్స్ ఫ్యాన్స్ తదితర సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ వివరించారు. ఈ కేంద్రం చుట్టూ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

నిరసన ప్రభావం ఉండదు : డీఈవో

అదనపు డీఏ కోసం ఫ్యాప్టో నిర్వహిస్తున్న నిరసన ప్రభావం పరీక్షల మూల్యాంకనానికి ఉంటుందనే అనుమానాలు ఉన్నా అవి పరీక్ష పత్రాల మూల్యాంకనం కోసం కాదని, ఉపాధ్యాయుల రెగ్యులర్ విధులకు సంబంధించిన డీఏ కోసం జరుగుతుందని, ఈ వాల్యూయేషన్‌కు ఎటువంటి ఇబ్బంది ఉండదని డీఈవో తెలిపారు.



ఏలూరులో స్పాట్ వాల్యూయేషన్‌కు ఎంట్రీ చేసుకుంటున్న టీచర్లు

ఏలూరు జిల్లాలో ప్రారంభమైన స్పాట్ వాల్యూయేషన్

- నేటికి సోషల్ స్టడీస్ స్పాట్ వాయిదా

ఏలూరు అర్బన్ : పదో తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం గురువారం ఏలూరు జిల్లాలో ఏలూరు సెయింట్ గ్జేవియర్ హైస్కూలులో ప్రారంభమైంది. ఆయా జిల్లాల నుంచి మూల్యాంకనం నిమిత్తం 1.85 లక్షల పలు సబ్జెక్టు జవాబు పత్రాలు అందాయి. ఆ సంఖ్యకు అనుగుణంగానే ఈనెల తొమ్మిదో తేదీకి స్పాట్ వాల్యూయేషన్‌ను ముగించడానికి అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయ సిబ్బందికి విధులు కేటాయించగా పలువురు ఆసక్తి కనబరచకపోవడంతో జిల్లా విద్యాశాఖ అధికార వర్గాలు కొంత ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చింది. పలు అభ్యంతరాలు, అభ్యర్థనలు, మినహాయింపులను పరిష్కరించిన తర్వాత మధ్యాహ్నం 12 గంటల నుంచి కొన్ని సబ్జెక్టుల మూల్యాంకనాన్ని ప్రారంభించారు. ఇంత చేసినా అన్ని సబ్జెక్టుల నుంచి సీఈలు 24 మంది, ఏఈలు 60 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 33 మంది ఇంకా అవసరమవుతారని గురువారం సాయంత్రానికి గుర్తించిన అధికారులు, ఆ లోటును భర్తీచేయడానికి మండలాల్లో అర్హులైన ఉపాధ్యాయులను గుర్తించి శుక్రవారం స్పాట్ డ్యూటీలకు పంపాలని డీవైఈవోలు, ఎంఈవోలను ఆదేశించాల్సి వచ్చింది. ఇంగ్లీషు సబ్జెక్టు జవాబుపత్రాల మూల్యాంకనానికి సిబ్బంది కొరత ఎక్కువగా ఉన్నట్టు తెలిసింది. ఈ దఫా రెగ్యులర్ టెన్త్ పరీక్షలతోపాటే సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య పదో తరగతి పరీక్షలను ఒకేసారి నిర్వహించడం, మూల్యాంకనాన్ని ఏక కాలంలో చేపట్టాల్సి రావడంతో ఉపాధ్యాయ సిబ్బంది కొరత ఏర్పడిందని చెబుతున్నారు. ఆ ప్రకారం 30శాతం అదనపు సిబ్బంది సహా మొత్తం 1,309 మందికి స్పాట్ డ్యూటీలను కేటాయించారు.

నేటి నుంచి పూర్తిస్థాయిలో : డీఈవో వెంకటలక్ష్మమ్మ

చివరిగా జరిగిన సోషల్‌స్టడీస్ పరీక్ష జవాబు పత్రాలు మూల్యాంకనం నిమిత్తం గురువారం సాయంత్రానికి చేరుకున్నాయి. వీటికి బార్ కోడింగ్ ఇచ్చిన తర్వాతే మూల్యాంకనం చేయాల్సి ఉన్నందున శుక్రవారం నుంచి ప్రారంభించేందుకు వీలుగా సోషల్ సబ్జెక్టు స్పాట్ సిబ్బంది సేవలను ఒకరోజు ఆలస్యంగా వినియోగించుకుంటామన్నారు. ఇది మినహా మిగతా అన్ని సబ్జెక్టుల జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తి స్థాయిలో ప్రారంభమైందన్నారు.



హార్బర్‌పై కొత్త ఆశలు !

- బియ్యపుతిప్ప వద్ద ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలు పరిశీలించాలి
- గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపనకే పరిమితం

జిల్లా కలెక్టర్‌కు సీఎం చంద్రబాబు ఆదేశం

నరసాపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో దశాబ్దాల కాలంగా హామీలు, శంకుస్థాపనలకే పరిమితమవుతూ వస్తున్న వాటిల్లో ఒకటి బియ్యపుతిప్ప హార్బర్. ఇప్పటి వరకు ఈ పనులకు మూడుసార్లు శంకుస్థాపనలు జరిగినా నిర్మాణం మొదలు కాలేదు. ఏదో ఒక కారణంతో పనులు పెండింగ్‌లో పడుతున్నాయి. అమరావతిలో ఇటీవల జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో సీఎం చంద్రబాబు హార్బర్ ప్రస్తావన తెచ్చారు. నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ నాగరాణిని ఆదేశించడంతో మళ్లీ హార్బర్‌పై కొత్త ఆశలు చిగురించాయి.

రూ.13.50 కోట్లతో శంకుస్థాపన

రాష్ట్ర విభజన తరువాత బియ్యపుతిప్ప వద్ద బోట్లు ఆగేందుకు వీలుగా ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ను ప్రతిపాదించారు. రూ.13.50 కోట్లతో చేపట్టే ఈ పనులకు 2019లో అప్పటి మంత్రిగా ఉన్న నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. భూసేకరణ, మట్టి ఫిల్లింగ్ పనులు పూర్తయ్యాయి. ఆ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రావడంతో ఈ పనులను రద్దు చేసి ఫిష్ ల్యాండింగ్ సెంటర్ కాకుండా కార్గో పోర్టును నిర్మించాలని ప్రతిపాదించింది. సుమారు రూ.429 కోట్ల అంచనా వ్యయం చేపట్టే ఈ పనులకు 2022లో అప్పటి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం జరగలేదు. మట్టి లెవెలింగ్ చేసి చేతులు దులుపుకున్నారు. పనులు జరగకపోవడంపై పలు వాదనలు తెరమీదకు వచ్చాయి. రాష్ట్రంలో ఎనిమిది హార్బర్‌లు నిర్మిస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. అందులో బియ్యపుతిప్ప హార్బర్ ఉంది. అన్ని నిర్మాణాలకు కేంద్రం ఓకే చెప్పి, దీనికి మాత్రం పచ్చజెండా ఊపలేదు. ఇందుకు బెంగళూరు నుంచి విచ్చేసిన టెక్నికల్ బృందం ఇచ్చిన నివేదికే కారణమన్న వాదన వినిపించింది. ప్రభుత్వం అధికారికంగా దీన్ని ప్రకటించలేదు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే హార్బర్‌ను పూర్తి చేస్తామని వెల్లడించింది. శంకుస్థాపన చేసి రెండేళ్లు గడిచినా.. పనులకు నిధులు మాత్రం విడుదల చేయలేదు. తాజాగా సీఎం ఆదేశాలతో ఇప్పటి వరకు సేకరించిన భూమి, సర్వేలు, టెక్నికల్ బృందం రిపోర్టు తదితర ఫైళ్లను అధికారులు బయటకు తీస్తున్నారు. మళ్లీ నిపుణులతో సర్వే చేయించి పనులు మొదలుపెడతారన్న వాదనలు వినిపిస్తున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న ఆరిమిల్లి, చిత్రంలో కలెక్టర్, జేసీ

స్వర్ణాంధ్ర లక్ష్యానికి కృషి చేద్దాం

తణుకు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర సాధించే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఆ దిశగా కృషి చేయాలని పారిశ్రామికంగా తణుకు ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందింది. రైతులు వరితోపాటు అంతర పంటలపై దృష్టి సారించాలి. పూలతోపాటు కూరగాయల సాగుపై దృష్టి పెట్టడం వల్ల జీడీపీ సాధించవచ్చు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పేరుతో చంద్రబాబు పిలుపు మేరకు గ్రామాల్లో పరిశుభ్రతను సాధించే దిశగా ప్రజలు సహకరించాలి' అని కలెక్టర్ నాగరాణి కోరారు. గురువారం తణుకు మునిసిపల్ కార్యాలయంలో విజన్-2047 యూనిట్ సమావేశం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పీ4 విధానంలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి ఒక విజన్ డాక్యుమెంట్ రుపొందించుకుని రాబోయే నాలుగేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం అమలు చేసే విధంగా కృషి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో కసిఫ్ కౌసర్‌బానో, మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడికి ఉపాధి పని కల్పిస్తాం : కలెక్టర్

నరసాపురం టౌన్ : వేసవిలో ప్రతి కార్మికునికి ఉపాధి పని కల్పిస్తామని కలెక్టర్ నాగరాణి తెలిపారు. గురువారం నరసాపురంలో ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేట్ వసతిగృహాలను తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, మెనూ అమలు జరుగుతున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదావరి తీరాన్న ఉన్న మునిసిపల్ డంపింగ్ యార్డును పరిశీలించారు. అక్కడ చెత్త రీసైక్లింగ్‌పై ఆరా తీశారు. అనంతరం రుస్తుంబాద లేసు పార్కును సందర్శించి, అక్కడ మహిళలతో అల్లికలు, శిక్షణపై ఆరా తీశారు. శిక్షణలో మెలకువలు నేర్చుకుని మరింత ముందుకు సాగాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లు షురూ..

- తాడేపల్లిగూడెంలో మొట్ట మొదటి కొనుగోలు కేంద్రం ప్రారంభం
- జిల్లాలో 348 కేంద్రాలు.. 6 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దాళ్వా వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఆ ధాన్యం దళారుల చేతిలోకి వెళ్లి రైతులు మోసపోకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ముందస్తుగానే ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేసింది. తొలిగా జిల్లాలోనే మొట్టమొదటి మాసూళ్లు నిర్వహించే తాడేపల్లిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, జిల్లా అధికారులు గురువారం ప్రారంభించారు. జిల్లాలో ఇప్పటికే వరి మాసూళ్లు ప్రారంభమైన తాడేపల్లిగూడెం మండలంలోనే తొలిసారిగా ధాన్యం కొనుగోలు నిర్వహించడంతో తమ ధాన్యం దళారులకు అందించకుండా ప్రభుత్వానికే ఆరుదల ధాన్యం అందించేందుకు వీలుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం సొమ్ముకూడా గత సార్వా సీజన్‌లో 24 గంటల లోపే రైతుల ఖాతాల్లోకి జమ కావడంతో తొలి ప్రాధాన్యం ధాన్యం కొనుగోలు కేంద్రాలకే ఇచ్చేందుకు వారంతా ఉత్సాహం చూపుతున్నారు.

జిల్లాలో 348 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో 348 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు పూర్తిచేసింది. ఈ మేరకు ధాన్యం కేంద్రాల వద్ద ఉన్న సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తిచేయడంతోపాటు సొసైటీల వారికి మార్గదర్శకాలు అందించారు. జిల్లాలోని 115 సొసైటీల ద్వారా 348 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నారు. ఆ కేంద్రాల వద్ద రైతులకు అందించేందుకు 15 లక్షల గోనె సంచులు సిద్ధం చేయగా మరో 20 లక్షల గోనె సంచులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం 208 రైస్ మిల్లులకు కేటాయించేందుకు ప్రణాళికలు రూపొందించారు.

అంతా దళారుల దోపిడీనే..

దళారులు రైతులను దోచుకుంటున్నారు. ప్రస్తుతం మండలంలో వరి మాసూళ్లు జరుగుతుండగా వారి వద్ద బస్తా ధాన్యం రూ.1300లకే కొంటున్నారు. అదే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరుదల ధాన్యం రూ.1725 వస్తోంది. రైతులకు సకాలంలో డబ్బులు రాక తీవ్ర ఇబ్బంది పడుతుంటారు. తూకంలోనూ మోసం చేస్తూ రైతుల కష్టాలను దోచుకోవడం దళారులకు కొట్టిన పిండిగా మారింది.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జేసీ

ధాన్యం కేంద్రాల ఏర్పాటు అభినందనీయం



ధాన్యం కొనుగోల్లు చేసేందుకు ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటుచేయడం అభినందనీయం. మా దగ్గర బయట దళారులు బస్తా ధాన్యం రూ.1300లకే కొనుగోలు చేస్తూ మమ్మల్ని దోచుకుంటున్నారు. ముందస్తుగానే ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో బాగుంది.

\- కోడే బాలాజి, మోదుగగుంట

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే విక్రయిస్తాం



ధాన్యం కొనుగోలు చేసేందుకు దళారులు ముందుకు వస్తున్నారు. కానీ చాలావరకూ తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ద్వారా విక్రయిస్తే 24 గంటల లోపే మాకు సొమ్ములు చేతికి వస్తున్నాయి. మేం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే విక్రయిస్తాం.

\- పెనుగుర్తి పెద్దిరాజు, మోదుగగుంట

ఎండ మంటలు


నిర్మానుష్యంగా మారిన భీమవరం అంబేద్కర్ సెంటర్

సూరీడు భగ్గుమన్నాడు.. గురువారం వేడిగాలుల ప్రభావంతో ప్రజలు అల్లాడారు. ఉదయం పది దాటాక బయటకు రావాలంటే భయపడి పోతున్నారు.. బయటకు వెళ్లితే గాని రోజు గడవని కూలీలు, స్కూల్‌కు వెళ్లే పిల్లలు ఎండలకు ఇబ్బందులు పడ్డారు.. ఉదయం ఎండ మండినా సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో వర్షంతో వాతావరణం చల్లబడింది..ఏలూరు నగరం, భీమవరం పట్టణాల్లో గురువారం ఎండ ప్రభావం దృశ్యాలివి..


ఖాళీగా ఉన్న ఏలూరు ఫైర్‌స్టేషన్ రోడ్డు



జలకాలాటలలో..



ఎండ మామూలుగా లేదు.. ఉదయం పది దాటితే ఎండ దెబ్బకు ఒళ్లంతా మంటలే.. ఎండ దాటికి బయటకు వచ్చే పరిస్థితి లేదు..ఎక్కడైనా ఇలాంటి నీటి ప్రవాహం కనిపిస్తే అమాంతం నీటిలోకి దూకి సేద తీరాలనిపిస్తుంది.. పోలవరం మండలం గూటాల పంపింగ్ స్కీం వద్ద గోదావరి కాలువలో పిల్లలు ఇలా ఈతలాడారు..ఒంటి పూట బడులు కావడంతో మధ్యాహ్నం నుంచి సాయంత్రంలో వరకూ కాల్వలోనే సేదతీరుతున్నారు..

-పోలవరం, (ఆంధ్రజ్యోతి)

డేంజరస్ !



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పొంచి ఉన్న ప్రమాదం

ఏలూరు నగరంలోని వెంకటాపురం పంచాయతీ కనకదుర్గమ్మ ఆలయ రోడ్డులోని మస్తాన్ మన్యం కాలనీ ప్రాథమిక పాఠశాల సమీపంలో రోడ్డు మార్జిన్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైర్ల సముదాయం వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు మార్జిన్‌లో ఉండడమే కాకుండా చిన్న పిల్లలకు సైతం విద్యుత్ వైర్లు అందే విధంగా బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆ ప్రాంత ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని, పిల్లలకు అందకుండా విద్యుత్ వైర్లు ఎత్తుగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మినీ వంతెనల వద్ద దెబ్బతిన్న మార్జిన్లు



నగరంలోని పాతబస్టాండ్ సెంటర్, గూడ్స్ షెడ్డు రోడ్డు, రైల్వేస్టేషన్ సమీపంలోని తూర్పు లాకుల వద్ద ఏలూరు కాలువపై అటు నుంచి ఇటు నుంచి అటు రాకపోకలు సాగించేందుకు చిన్న వంతెనలను నిర్మించారు. వంతెనలు ఎక్కే, దిగే క్రమంలో మార్జిన్లు దెబ్బతినడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో దగ్గరకు వెళ్ళే వరకు గోతులు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

- ఏలూరు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)



కేబుళ్లతో కళా విహీనం



ఏలూరు నగరంలో గోడలకు అందమైన పెయింటింగ్స్ వేయించి సుందరంగా ఉండేలా తీర్చిదిద్దారు. నగరానికి వచ్చినవారికి ఇవి ఆహ్లాదంతో పాటు ఆనందం ఇస్తున్నాయి. అయితే వాటి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాల సంగతేంటి..? వాటికి చుట్టుకు పోయిన ఉన్న కేబుల్స్ మాటేంటి...? ఈ కేబుల్ చుట్టలు స్తంభాలకు వేలాడుతూ కళా విహీనంగా ఉన్నాయి. ఇంటర్నెట్, ఎంఎస్‌వో ఆపరేటర్ల కేబుల్స్ అన్నీ చుట్టలుగా స్తంభాలకు తగిలించడంతో కళావిహీనంగా కనిపిస్తున్నాయి. ఒక్కోసారి అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. నగరంలోని ఏ స్తంభం చూసినా కేబుల్ చుట్టలు కనిపిస్తున్నాయి. రోడ్డు మధ్యలో పైభాగం మీదుగా కేబుల్ వైర్లు వేస్తున్నారు. దీంతో ప్రమాదాలతో పాటు అస్తవ్యస్తమైన వాతావరణం నెలకొంది. అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను అమలు చేస్తే ప్రమాదాల నివారణతో పాటు నగరం సుందరీకరణంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఒక్కసారి కేబుల్ వైర్లు తెగి వాహన చోదకులపై కూడా పడుతున్నాయి..

- ఏలూరురూరల్, (ఆంధ్రజ్యోతి)

శిశు గృహాలకు చిన్నారులు తరలింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భీమవరం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ధర్మం శరణం గచ్ఛామి (పిల్లలతో యాచక వ్యాపారం) ఫొటో వార్తకు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పందించారు. తక్షణం పిల్లలను ఎక్కడ ఉన్నారో గుర్తించి ఆదుకోవాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య సిబ్బంది, పోలీస్ శాఖ పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలో చెత్త సేకరిస్తూ, భిక్షాటన చేస్తున్న తల్లితో పాటు నలుగురు బాలలను పోలీసులు గుర్తించారు. వీరిని తాత్కాలిక వసతి నిమిత్తం జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి ఆదేశాలపై శిశు గృహానికి తరలించారు.

చేతులు కాలుతున్నాయి స్వామీ..!

చిన వెంకన్న ఉచిత ప్రసాద వితరణ సిబ్బంది దురుసుతనం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పరమ పవిత్రమైన ద్వారకాతిరుమల స్వామి వారి ప్రసాదాన్ని అందుకున్న భక్తుల చేతులు బొబ్బలెక్కుతున్నాయి.. భక్తులంటే చులకనగా భావిస్తున్న ప్రసాదాల వితరణ సిబ్బంది చేష్టలు మితిమీరుతున్నాయడనానికి ఇదొక ఉదాహరణ. వేడి వేడి ప్రసాదాన్ని ఓ చిన్న దొన్నెలో వేసి ఇవ్వడమే కాకుండా వారిపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వామివారి దర్శనానికి బుధవారం వెళ్లి వచ్చిన భక్తులకు ఎదురైన చేదు అనుభవం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏలూరుకు చెందిన ఓ భక్తుని కుటుంబం స్వామి వారి దర్శనానంతరం తూర్పుగోపురం పక్కనున్న ఉచిత ప్రసాదాలు అందించే షెడ్డులోకి వెళ్లారు, ప్రసాదాలు అందించే ఉద్యోగి విసుక్కుంటూ క్యూ లైన్లలో ఉండే వారి చేతిలో దొన్నెతో నింపిన ప్రసాదాన్ని హడావుడిగా ఇచ్చేస్తున్నాడు. అది చింది కొందరి చేతుల మీద కూడా పడింది. బాబోయ్.. కాలిపోతోంది సార్ ! అంటున్నా వినకుండా క్యూలైను జరిపేస్తున్నాడు. ఇదేంటని కొందరు నిలదీస్తే వారిపై సదరు ఉద్యోగి విరుచుకుపడ్డాడు. "ఈ ప్రసాదం చల్లారాలంటే ఏడు గంటల పైనే పడుతుంది అప్పటి వరకూ ఉంటావా...ఉచితంగా ప్రసాదం ఇస్తుంటే తీసుకోకుండా ఏంటా ప్రశ్నలు" అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడాడు. అక్కడున్న ఓ వృద్ధురాలు, మరికొంత మంది సైతం చేయికాలి లబోదిబోమన్నారు. ఏలూరుకు చెందిన భక్తురా ఇంటికి వెళ్లిన తర్వాత చూసుకోగా చేయి బొబ్బలెక్కింది. శ్రీవారి దర్శనానంతరం ప్రసాదం స్వీకరించేందుకు వెళ్లే భక్తులకు ఆ ప్రసాదాన్ని అందజేసే వారి నుంచి ఛీత్కారాలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. ఆలయ అధికారులు ఇటువంటి ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


బొబ్బలెక్కిన చేయిని చూపుతున్న ఏలూరుకు చెందిన భక్తురాలు

నిప్పుల గుండం తొక్కిన భక్తులు

దెందులూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు మండలం చల్లచింతలపూడి లో వెలసిన యలమర్తి వారి ఆడపడుచు గ్రామ దేవత పాటిమ్మ పేరంటాలమ్మ తల్లి జాతర ఉత్సవాల ఆఖరి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద నిప్పులగుడం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ దంపతులు యలమర్తి హేమలత, శ్రీనివాస్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించి నిప్పులగుండం తొక్కారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి అన్నదానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేవస్థానం కమిటీ సభ్యులు పావులూరి దశరథ రామయ్య, ముమ్మడి మోహన్‌రావు, సత్యనారాయణ, మోహన్ మురళీకృష్ణ, బోర్రాయ్య, రామయ్య తదితరులు నిప్పుల గుండం తొక్కారు.


నిప్పుల గుండం తొక్కుతున్న ఆలయ చైర్మన్ దంపతులు



భద్రాచల రామయ్య కల్యాణానికి పాదయాత్రగా..

కుక్కునూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో సీతారాముల కల్యాణం వీక్షించేందుకు వేలాది మంది భక్తులు పాదయాత్ర చేస్తూ తరలివెళ్తున్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన భక్తులు గోటి తలంబ్రాలతో చిన్నా, పెద్దా అంతా జైశ్రీరామ్ నినాదాలు చేస్తూ తరలివెళ్తున్నారు. గురువారం కుక్కు నూరులోని రామాలయం వద్ద శంకు బాబు అనే భక్తుడు వారికి భోజన ఏర్పాట్లు చేశారు. ఉప్పేరులో భక్తులకు భోజన వసతి కల్పించారు. ప్రతీ ఏటా వేలాది మంది భక్తులకు స్థానిక ప్రజలు మజ్జిగ అందిస్తున్నారు.

తాగే నీరు సురక్షితమేనా ?



- కలుషితమవుతున్న కాల్వలు, తాగునీటి చెరువులు
- పంచాయతీ కుళాయి నీటిపై ప్రజల్లో భయాలు
- వాటర్ ప్లాంట్ల నీరు వినియోగం
- విచ్చలవిడిగా ఆర్వో ప్లాంట్స్
- వేసవిలో జోరుగా వ్యాపారం
- ప్రమాణాలు పాటిస్తున్నారా..లేదా ?
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

నిడమర్రు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మనం తాగేనీరు సురక్షిత మేనా ? పంచాయతీ కుళాయి నీటి నుంచి ఆర్వో ప్లాంట్ల వరకు నీరు తెచ్చుకుని తాగేవారు అందరికీ సహజంగా వచ్చే సంశయమే ఇది.. కానీ సమాధానమే దొరకదు.. అసలే వేసవి కాలం.. ఎక్కడి కక్కడ దాహం కేకలు వినిపిస్తుంటాయి. మంచినీరు దొరికితే అదే మహా భాగ్యం అనుకుంటారు. గోదావరి జిల్లాల్లో కాల్వలు చెరువులు కలుషితమవుతున్నాయి.. కలుషిత నీటి కారణంగా డయేరియా, జ్వరం, నీళ్ల విరేచనాల , టైఫాయిడ్ వంటి రోగాల బారిన పడుతున్నారు.ఆక్వా చెరువుల వల్ల తాగునీటి వనరులన్నీ కలుషితమైపోయాయి. కాలువలు చెత్త, వ్యర్థాలతో నిండిపోతున్నాయి. పంచాయితీల్లో ఫిల్టర్లు పనిచేయకపోవడంతో కాలువల్లో నీటినే తోడి కుళాయిల ద్వారా ఇవ్వడంతో ప్రజలు కుళాయి నీటిని తాగడం మానేశారు.ఇంటి అవసరాలకు మాత్రమే వాడుకొంటూ వాటర్ ప్లాంట్స్ నుంచి నీటిని కొనుగోలు చేసి తాగు తున్నారు. కానీ అవి ఎంతవరుకు సేఫ్ ? ఎవరికి తెలుసు ?

విచ్చలవిడిగా ఆర్వో ప్లాంట్స్

పంచాయతీ కుళాయిల్లో సరఫరా అవుతున్న మంచినీటిపై నమ్మకం కోల్పోయిన ప్రజలు నేడు ప్రతి గ్రామంలోనూ ఆర్వో వాటర్ ప్లాంట్స్‌పై ఆధారపడుతున్నారు. ఒక్కో గ్రామంలో సుమారు 5 నుంచి 10 వరకు వాటర్ ప్లాంట్స్ వెలిశాయి. విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న వాటర్‌ప్లాంట్స్‌ను పర్యవేక్షించేనాథుడు లేక ఇష్టారా జ్యంగా సాగుతోంది. ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే స్థానికంగా గల మంచినీటి చెరువు నీటిని, బోరు వాటర్‌ను ఫిల్టర్ చేసి సరఫరా చేస్తూ ప్రజల నుంచి డబ్బులు గుంజు కొంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో సుమారు 2 వేల వాటర్ ప్లాంట్లు వెలిశాయి. ఏలూరు జిల్లా 28 మండలాల్లో సుమారు 400 నుంచి 500 వాటర్ ప్లాంట్లు పనిచేస్తున్నాయి.. పశ్చిమ గోదావరి జిల్లా మండలాలు 20 మండలాలు ఉండగా 500 నుంచి 600 ఆర్వో ప్లాంట్లు నీటిని అందిస్తున్నాయి.. వీటిని పర్యవేక్షించే నాథుడే లేరు.



వేసవిలో జోరుగా వ్యాపారం

ప్రస్తుతం వేసవిలో ఎండల వల్ల మంచినీళ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రతిఒక్కరూ ఇష్టారాజ్యంగా బోరువేయడం చిన్న మిషనరీ తేవడం, ఆర్‌వో వాటర్, ఫౌండేషన్ పేరుతో పంపిణీ చేసి మంచినీళ్లతో వ్యాపారం చేస్తున్నారు. కొన్నిచోట్ల గ్రామ పంచాయితీ మంచినీటి చెరువులోనే పైప్ కనెక్షన్ ఇచ్చి 15 లీటర్లు టిన్ను 10 రూపాయల నుంచి రూ.20 కు అమ్ముతున్నారు. ఆర్‌వో ప్లాంట్స్‌పై సరైన పర్యవేక్షణ ఉన్న దాఖలాలు కానరావడం లేదు. ఆర్వో నీరు పేరుతో గ్రామాల్లో వేలల్లో సంపాదిస్తుండగా పట్టణాల్లో అయితే లక్షల్లో సాగుతోంది.

ఈ నిబంధనలు పాటిస్తున్నారా ?

- రివర్స్ ఆస్మోసిస్ వాటర్ ప్లాంట్ (ఆర్‌వో ప్లాంట్) నిర్వహిం చడానికి ప్రభుత్వ లైసెన్స్ తప్పనిసరి. దీనితోపాటు నీటి నాణ్యతా ప్రమాణాలు నిర్ధారించడం, పర్యావరణ ప్రమాణాలు పాటించడం, భద్రతా చర్యలు తీసుకోవడం వంటి చర్యలు తప్పనిసరిగా పాటించాలి.
- వాణిజ్యపరమైన ఆర్వో వాటర్‌ప్లాంట్ నిర్వహించాలంటే తప్ప నిసరిగా చిన్నతరహా పరిశ్రమగా నమోదు చేసుకోవాలి.భారత ఆహార భద్రత ప్రమాణాల అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. కాలుష్య నియంత్రణ ధృవీకరణ పత్రం పొంది ఉండాలి.
- ఆర్వో ప్లాంట్ సరఫరా చేసే నీరు బీఐఎస్ ప్రమాణాల ప్రకారం శుద్ధి చేయబడి ఉండాలి. నీటి నాణ్యత ప్రమాణాల్లో భాగంగా ముడి, శుద్ధి చేయబడిన నీటి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి వాటిని ప్రదర్శించాలి.
- ఫిల్టర్ చేసిన నీటి టీడీఎస్ (టోటల్ డిసాల్వ్ సాలిడ్స్) స్థాయి ఆమోదయోగ్యమైన పరిధిలో 80 నుంచి 150 ఎమ్‌జి-ఎల్‌లో ఉండేలా చూసుకోవాలి.
- నీటి పీహెచ్ స్థాయి, నీటి ఉష్ణోగ్రత స్థాయి, నీటి కాఠిన్యం, సిల్ట్ డెన్సిటీ ఇండెక్స్ , అవశేష క్లోరిన్, ఐరన్ కంటెంట్, సిలికాన్ స్థాయి, వాటర్ రికవరీ రేటులను యాజమాన్యం, అధికారులు తప్పక పర్యవేక్షిస్తూ ఉండాలి.

ప్రభుత్వం పట్టించుకుంటున్నదా ?

రాష్ట్రంలో రాష్ట్ర నీరు, భూమి, చెట్లు అథారిటీ సంస్థ ఈ ఆర్‌వో వాటర్ ప్లాంట్లను పర్యవేక్షిస్తున్నది. ఉన్నతాధికారులు కానీ, మండల స్థాయి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కానీ, గ్రామ పంచాయతీ సచివాలయ సిబ్బంది కానీ ఈ వాటర్ ప్లాంట్స్‌ను పర్యవేక్షిస్తున్న దాఖలాలు లేవు. మొక్కుబడి తనిఖీలతో, మామూళ్ల మత్తులో కాలం గడుపుతున్నట్లు తెలుస్తున్నది. ఆర్‌వో ప్లాంట్స్ నీరు సురక్షితమేనా అన్న భావన ప్రజల్లో నెలకొంది. గృహ అవసరాలకు, వివాహ కార్యక్రమాలు, ఫంక్షన్లకు ఆర్వో వాటర్‌నే వాడుతున్నారు.

• ప్లాంట్ల వద్ద నీటి ప్రమాణాల బోర్డు ప్రదర్శించాలి



విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న ఆర్వో వాటర్‌ప్లాంట్లపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నీటి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్న విషయం స్థానికులకు కూడా తెలియడం లేదు. ప్రజల బలహీనతను ఆసరాగా చేసుకొని కొన్ని వాటర్‌ప్లాంట్ల వారు బోరు నీటినే డైరెక్టుగా అమ్ముతూ సొమ్ము చేసుకొంటున్నారు. జిల్లా స్థాయి అధికారుల దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని డ్రైవ్ నిర్వహించి ప్రతి ఆర్‌వో ప్లాంట్స్ సందర్శించి నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలి. నీటి నాణ్యతా ప్రమాణాల బోర్డును ఆయా ఆర్వో ప్లాంట్ల వద్ద ప్రదర్శించాలి. అప్పుడే ప్రజలకు నమ్మకం కల్గుతుంది.

సంకు నాగ శేషు, వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా కన్వీనర్, ఏలూరు

• పంచాయతీ అధికారులు తనిఖీలు చేయాలి



తాగునీటి కోసం ఎక్కువ శాతం మంది ఆర్వో ప్లాంట్లపై ఆధారపడు తున్నారు. నిర్వాహకులు నిబంధనలు సరిగా పాటించడం లేదు. వాటిపై సరైన పర్యవేక్షణ లేదు. పంచాయతీ అధికారులు ఆర్వో ప్లాంట్లను తనిఖీ చేసి నియమ నిబంధనలు పాటిస్తున్నదీ లేనిదీ పరిశీలించాలి. స్థానిక ప్రజలకు అధికారులు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

షేక్ రంగావళి, ఉపాధ్యాయుడు, శాంతి నగర్, ఏలూరు



తహసీల్దారు కార్యాలయం ఆవరణలో డాగ్ , బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

పోలవరం ప్రభుత్వ కార్యాలయాల్లో
డాగ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

పోలవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో జిల్లా బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ఇటీవల చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో మావోయిస్టుల భారీ ఎన్‌కౌంటర్లు జరిగిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద బాంబ్ స్క్వాడ్ తనిఖీలు జరుగుతున్నట్లు భావిస్తున్నారు. ఈ బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందంలో పీసీలు రాపాక నవీన్, డాగ్ హ్యాండ్లర్ రామాంజనేయులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

దొడ్డనపూడిలో వైసీపీ నేత హవా చోద్యం చూస్తున్న అధికారులు



ఆక్రమణపై మూడేళ్ల క్రితం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

దొడ్డనపూడిలో ఆర్ఎస్ నెం. 205/1ఏ లో సుమారు 90 సెంట్లు, 1బీలో సుమారు 50 సెంట్లు ప్రభుత్వ పోరంబోకు భూమి ఉంది. ఈ భూమిపై సరిహద్దు రైతు, వైసీపీ నేత కన్నువేశాడు. అప్పట్లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ

మూడేళ్లుగా కబ్జా ప్రయత్నాలు

భూమి ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. రెవెన్యూ అధికారుల అండతో తన పొలాన్ని చెరువుగా మార్చుకునే సమయంలో ఈ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో గ్రామస్థులు 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తేవడంతో 2022 డిసెంబర్ 8న 'దర్జాగా.. కబ్జా' శీర్షికన ప్రచురితమైన కథనంతో అధికారులు కదిలారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల స్థాయి అధికారులు కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి తవ్వకం పనులు నిలిపివేశారు. అప్పటికే మూడుసార్లు చెరువు తవ్వకానికి ప్రయత్నించారని తెలియడంతో మరొకమారు తవ్వితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అప్పటి తహసీల్దార్ టిపి కృష్ణారావు హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడిన 'ఆంధ్రజ్యోతి'కి అప్పట్లో గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కాళ్ల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏదైనా అధికార, ఆర్థిక బలం ఉంటే అడ్డుకునేది ఎవరంటూ స్థానిక వైసీపీ నేత దర్జాగా ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. చెరువు తవ్వకం చేపట్టినా అధికారులు పట్టించుకోవడం లేదని కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారినా వైసీపీ నేత హవా కొనసాగుతోందని నాయకులు మండి పడుతున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు సైతం చోద్యం చూస్తున్నారని, కబ్జా వ్యవహారం స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకెళతామని గ్రామస్థులు చెబుతున్నారు.

మరోసారి ఆక్రమణ యత్నం!

దాదాపు రెండున్నరేళ్లపాటు ఖాళీగా ఉన్న భూమిపై మరోసారి వైసీపీ నేత ఆక్రమణకు రంగం సిద్ధం చేశారు. స్థానిక అధికారులను ప్రసన్నం చేసుకుని పది రోజులుగా గట్లను ఎత్తు చేసుకునే పనిలో ఉన్నారు. రోడ్డున వెళ్లేవారికి పనులు కనిపించకుండా, ఎవరూ తన గట్టుకు రాకుండా ఒక గేటు ఏర్పాటు చేసి తాళం కూడా వేశాడు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు అటువైపు కూడా చూడడం లేదని గ్రామస్థులు మళ్లీ 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ అధికారులను వివరణ కోరడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకిరణ్, స్థానిక వీఆర్వో చిట్టిబాబు ఆక్రమణ భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులు నిలిపివేశారు. మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తులో గట్టు వేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. భూమిని గతంలోనే తాము కొనుగోలు చేశామని, దానికి సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయని సదరు నేత తెలపడంతో తహసీల్దార్‌కు చూపాలని అధికారులు తెలిపారు. ఇదే భూమిని గతంలో తవ్వుతుండగా ప్రభుత్వ భూమి అంటూ రెవెన్యూ అధికారులు మూడుసార్లు నిలుపుదల చేయడం గమనార్హం. ఆన్‌లైన్ అడంగళ్‌లో ప్రభుత్వ పోరంబోకుగా ఉందని, దీనికి పట్టా ఎలా ఇచ్చారు..? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో చెత్త వేసుకోవడానికి డంపింగ్ యార్డ్ లేదని, ఇలాంటి ప్రభుత్వ భూములను గ్రామ అవసరాలకు వినియోగించుకుంటే బాగుంటుందని కొంత మంది గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమిలో తవ్వకం పనులు



జాలిపూడి డ్రెయిన్‌పై ఆక్రమణలు!

ఏలూరురూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని జాలిపూడి డ్రెయిన్‌పై ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ఈ డ్రెయిన్ ద్వారా చాటపర్రు, జాలిపూడి, కాట్లంపూడి తదితర ప్రాంతాలకు సాగునీరు అందుతుంది. కొన్నేళ్లుగా డ్రెయిన్‌పై ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎవరికి అనువుగా వారు ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నారు. వాహనాలు వెళ్లేవిధంగా చిన్న వంతెనలను సైతం నిర్మాణాలు చేపట్టినా అధికారులు చోద్యం చూస్తున్నారు. జాలిపూడి డ్రెయిన్ సుమారు నాలుగు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అడుగడుగునా చెత్తాచెదారం పేరుకుపోయి రబీ, ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూడు, చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించాలని, ఆక్రమణలను నిలువరించాలని రైతు సంఘాల నాయకులు ఆందోళన చేసినా ఫలితం లేదు. ఆక్రమణలపై అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేటి నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు జిల్లా కోఆర్డినేటర్

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్‌కు సన్నద్ధమయ్యే విద్యార్థులకు జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో శుక్రవారం నుంచి 28 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. జంగారెడ్డిగూడెం కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ ఏలూరు జిల్లా కోఆర్డినేటర్ పి.సుబ్రహ్మణ్యం గురువారం వివరాలు తెలిపారు. మ్యాథ్స్ ఫిజిక్స్ కెమిస్ట్రీలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ప్రతీ రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు మూడు గంటల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు మీడియంలో కూడా కోచింగ్ ఇస్తామని ఆయన తెలిపారు. కోచింగ్ అనంతరం ఏప్రిల్ 28న గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు కోచింగ్‌తో పాటు ఉచిత మెటీరియల్ అందిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిసెట్‌కు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని, 30న పాలిసెట్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అధ్యాపకులు ఎస్ఎస్ఆర్.ప్రసాద్, బి.రమేష్, కె.కేశవ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సీటీ స్కాన్



రోగికి సీటీ స్కాన్ తీస్తున్న దృశ్యం

నెల రోజుల తర్వాత అందుబాటులోకి..

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నెల రోజుల తర్వాత సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. మరమ్మతు అనంతరం గురువారం యథావిధిగా పని చేస్తుంది. మార్చి 1న సీటీ స్కాన్ మిషన్‌లోని ట్యూబు పోవడంతో సంబంధిత కంపెనీ ప్రతినిధులు మరమ్మతు చర్యలు చేపట్టారు. సుమారు రూ.25 లక్షల విలువైన ట్యూబు బుధవారం సాయంత్రానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుంది. ఇంజనీర్లు కొన్ని గంటల పాటు మరమ్మతులు నిర్వహించి ట్యూబ్‌ను అమర్చారు. రోగులకు గురువారం ఉదయం నుంచి సీటీ స్కాన్ తీస్తున్నారు. గురువారం ఒక్కరోజే 42 స్కాన్‌లను తీశారు. ప్రభుత్వాసుపత్రిలో సీటీ స్కాన్ సేవలు పూర్తిగా ఉచితం. ప్రభుత్వాసుపత్రి ఓపీ విభాగంలో కాని ఇన్‌పేషెంటుగా ఉన్న వారికి సంబంధిత ఆసుపత్రి వైద్యుల సూచన మేరకు స్కానింగ్‌ను తీస్తున్నారు. సీటీ స్కాన్ అందుబాటులోకి రావడంతో రోగులకు ఖర్చు, సమయం కలిసి వచ్చింది.

ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఆర్‌బీఐ సేవలు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

భీమవరంటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఆర్‌బీఐ సేవలందిస్తుందని యూనియన్ బ్యాంక్ భీమవరం శాఖ చీఫ్ మేనేజర్ ఎం.నిర్మల జ్యోతి అన్నారు. 90 ఏళ్ల క్రితం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించబడిందన్నారు. యూబీఐలో గురువారం ఆర్‌బీఐ వ్యవస్థాపక దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్మల జ్యోతి మాట్లాడుతూ ఆర్‌బీఐ ప్రారంభంలో ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్నప్పటికీ 1949లో జాతీయం చేయబడిందని, అప్పటి నుంచి భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధీనంలోకి వచ్చిందన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నోట్ల జారీలో ఆర్‌బీఐ గుత్తాధిపత్యాన్ని కలిగి ఉందన్నారు. బ్యాంక్ విధి విధానాలపై విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్.వెంకన్నబాబు, కె.పార్వతి, విజ్ఞాన కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బియ్యం లోడుతో వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

విజిలెన్స్ తనిఖీల్లో రేషన్ బియ్యం స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ విజిలెన్స్ అధికారి వి శ్రీరాం బాబుకు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ వి.ప్రసాద్ కుమార్, ఎస్ఐ కె.నాగరాజు, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత చాట్రాయిలో నిఘా పెట్టారు. ఏపీ 39యుజడ్2685 నెంబర్ గల మినీ లారీలో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుండగా విజిలెన్సు అధికారులు పట్టుకున్నారు. డ్రైవర్ చప్పిడి వెంకటకృష్ణను ప్రశ్నించగా ఆ బియ్యం నాగరాజు కృష్ణ శివదీప్ నకు చెందినవని వివరించాడు. చాట్రాయి పరిసర ప్రాంతాల్లో కార్డుదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని కోళ్ల ఫారాలకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలియజేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.1.6 లక్షలు ఉంటుందన్నారు. వ్యాన్‌తో సహా బియ్యం సీజ్ చేసినట్లు తెలిపారు. మాదరాజు కృష్ణ శివదీప్, చప్పిడి వెంకట కృష్ణ, లారీ యజమాని కె మహేశ్వర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గోపవరంలో బంగారు ఆభరణాలు అపహరణ

కైకలూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో మూడున్నర కాసుల బంగారు ఆభరణాలు అపహరించారు. కైకలూరుటౌన్ ఎస్సై ఆర్.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం గోపవరం గ్రామానికి చెందిన గూడురు వెంకట లక్ష్మీనాగేశ్వరరావు గత నెల 23న ఇంటికి తాళం వేసి విశాఖపట్నంలో ఆయన కుమార్తె వద్దకు వెళ్లారు. తిరిగి గురువారం ఉదయం ఇంటికి రాగా తలుపులు పగలగొట్టి ఉండడాన్ని గుర్తించి టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ పి కృష్ణ, ఎస్సై ఆర్.శ్రీను పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైకల్యం అధిగమించాలి

- ప్రత్యేక అవసరాలు గల 852 మందికి ఉపకరణాల పంపిణీ
- రాష్ట్రంలో ఏలూరు జిల్లా నుంచే శ్రీకారం



బ్యాటరీ ట్రైసైకిల్ పనితీరుపై డెమో పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వైకల్యాన్ని అధిగమించి ముందుకు సాగాలని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలుగల పిల్లల (సీడబ్ల్యుఎస్ఎన్)కు ప్రభుత్వం సరఫరా చేసిన ఉపకరణాలను గురువారం వారు అందజేశారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉపకరణాల పంపిణీ ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలో తొలిసారిగా ఏలూరు జిల్లా నుంచే ప్రారంభించారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వైకల్యంతో ఉన్న 928 మందిని బాలబాలికలను గుర్తించారు. వారిలో 852 మందికి ఉపకరణాలు అవసరమని ఎంపిక చేశారు. కలెక్టర్ వెట్రిసెల్లి మాట్లాడుతూ ఏకకాలంలో 852మందికి ఉపకరణాలు అందజేసి ఏలూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తోన్న భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపిస్టులు, ప్రత్యేక ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ సమాజంలో అందరితో సమానంగా ఎదిగేలా ప్రభుత్వపరంగా అన్ని సదుపాయాలను కల్పిస్తామన్నారు. సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకోసం సీపీ చైర్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిళ్లు, టీఎల్ఎం కిట్లు అందజేసిందన్నారు. రూ.75లక్షలు ఖరీదుచేసే ఉపకరణాలను జిల్లాలోని ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా పంపిణీ చేశామన్నారు. సమగ్రశిక్ష విలీనవిద్య జిల్లా కోఆర్డినేటర్ భాస్కరరాజు మాట్లాడుతూ మీరట్‌కు చెందిన అలింకో కంపెనీ తయారుచేసిన ఉపకరణాలపై సంబంధిత విద్యార్థి ఆధార్ నెంబర్‌తో కూడిన క్యూఆర్ కోడ్ ఉంటుందని, వీటికి రెండేళ్లపాటు గ్యారెంటీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, అలింకో సంస్థ ప్రతినిధులు, బాలబాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నలుగురు నకిలీ పోలీసుల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు, వివరాలు చెబుతున్న ఏఎస్పీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నలుగురు యువకులు ముఠాగా ఏర్పడ్డారు. ఒకరు పోలీసు యూనిఫామ్‌లో ఉంటారు. మిగిలిన ముగ్గురు మఫ్టీ పోలీసులుగా చెప్పుకుంటారు. రాష్ట్రీయ రహదారిపై టీ కొట్టు యజమానిని బెదిరించి రూ.వెయ్యి వసూలు చేశారు. అంతలో హైవే పెట్రోలింగ్ వాహనం రావడంతో పారిపోయారు. నలుగురు నకిలీ పోలీసులను అరెస్టు చేసినట్లు ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఏఎస్పీ తెలిపారు.

భీమడోలు మండలం పూళ్ళ గ్రామానికి చెందిన బుంగా ప్రశాంతకుమార్, పోలీస్ యూనిఫాం ధరించగా పెరికే సురేంద్ర కుమార్ లాఠీ చేతపట్టుకున్నారు. ఉంగుటూరుకు చెందిన గొల్లా సురేష్‌కుమార్, పూళ్ళ గ్రామానికి చెందిన కొరపాటి రోహిత్ కలిసి ఈనెల 1న రాత్రి 11.30 గంటలకు టీ దుకాణం వద్దకు వచ్చారు. పోలీసులమని షాపు ఎందుకు తెరచి ఉంచావని అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని బెదిరించి వెయ్యి రూపాయలు ఇస్తే వదిలేస్తామని చెప్పారు. అదే సమయంలో అటుగా వస్తున్న హైవే పెట్రోలింగ్ పోలీసులను చూసి నకిలీ పోలీసులు పారిపోయారు. ద్వారకా తిరుమలకు చెందిన టీ దుకాణం నిర్వాహకుడు మాండ్రు డేవిడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకాతిరుమల ఎస్ఐ వి.సుధీర్ సిబ్బంది కలిసి నిఘా ఏర్పాటు చేశారు. నకిలీ పోలీ సులు నలుగురిని భీమడోలు జంక్షన్ వద్ద గురువారం ఉదయం అదుపులోకి తీసుకుని విచారించారు. టీ దుకాణం వద్ద బెదిరించి వెయ్యి రూపాయలు తీసుకున్న ముఠా వారేనని గుర్తించారు. చెడువ్యసనాలకు బానిసలైన వీరు ఏలూరులోని పోలీస్ యూనిఫామ్ కుట్టే టైలర్ వద్ద యూనిఫామ్ కుట్టించుకుని నకిలీ పోలీసులుగా అవతారం ఎత్తారని గుర్తించారు. వారి నుంచి కారు, పోలీస్ యూనిఫామ్, లాఠీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, భీమడోలు సీఐ యుజె విల్సన్, ద్వారకాతిరుమల ఎస్ఐ వి సుధీర్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒక వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఉంగుటూరు మండలం చిన వెన్నపల్లి గ్రామానికి చెందిన యాండ్ర నాగేశ్వరరావు (65) గురువారం ఉదయం ఏలూరు సమీపంలోని దుగ్గిరాల బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయం భీమవరం యువకుడి అరెస్టు

బంజారాహిల్స్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ విక్రయిస్తున్న భీమవరం యువకుడిని హైదరాబాద్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 11 తాడిపత్రి బిర్యానీ సెంటర్ వద్ద డ్రగ్స్ అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. మఫ్టీలో నిఘా పెట్టారు. ఓ యువకుడు ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా అతడి వద్ద 7 గ్రాముల కొకైన్, 3.7 గ్రాముల ఎక్టసీ పిల్స్ లభించాయి. అతడిని ప్రశ్నించగా పెడ్లర్ వద్ద కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. నిందితుడు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన కోపర్తి సాయిమణికంఠ అని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. యువకుడి వద్ద మత్తుపదార్థాలు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.



లక్కవరం ఎర్ర కాలువలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు, పర్యవేక్షిస్తున్న ఎస్ఐ శశాంక

ఎర్రకాలువలో రైతు గల్లంతు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లక్కవరం గ్రామానికి చెందిన రైతు చల్లా బసవయ్య (70) పశువులను మేపడానికి వెళ్లి ఎర్రకాలువలో పడి గల్లంతయ్యాడు. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్కవరం గ్రామానికి చెందిన చల్లా బసవయ్య ప్రతీ రోజు పశువులను మేపి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తాడు. గురువారం సాయంత్రం పొలంలో పశువులు మాత్రమే వస్తుండడంతో స్థానికులు ఇంటికి వెళ్లి సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. వెతికారు. ఎర్రకాలువ ఒడ్డున బసవయ్య చెప్పులు, టవల్, కర్ర ఉండడంతో పశువులను కడగడానికి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడని భావించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో రాత్రి పొద్దు పోయేవరకు గాలింపు చర్యలు చేపట్టారు. అతడి ఆచూకీ లభ్యం కాలేదు. లక్కవరం ఎస్సై శశాంక సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు పర్యవేక్షించారు.

ఆటో, మోటార్‌సైకిల్ ఢీకొని ఇద్దరికి గాయాలు



ప్రమాద స్థలంలో ఆటో, బైక్

పెనుమంట్ర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పెనుమంట్ర శివారు బ్రాహ్మణ చెరువు వద్ద మార్టేరు రహదారిపై గురువారం ఆటో, మోటార్ సైకిల్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. రావులపాలెం నుంచి ఆకివీడు వెళుతున్న ఆటో ఆగిఉన్న మరో ఆటోను ఢీకొని అదుపుతప్పి మోటార్ బైక్‌పై వెళుతున్న వ్యక్తిని ఢీకొంది. ఈ సంఘటనలో మోటార్ సైకిలిస్ట్ సత్యనారాయణ, ఆటో డ్రైవర్ గాయపడ్డారు.

ట్రాక్టర్, ఆటో ఢీకొని..

ఆచంట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎ.వేమవరం వద్ద గురువారం ట్రాక్టర్, ఆటో ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. ఆటోలో ప్రయాణిస్తున్న యర్రగొప్పుల శారద, గంధం శ్రీనివాస్ గాయపడడంతో పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం పాలకొల్లు ఆసుపత్రికి తరలించారు.

'నన్నయ'లో
క్యాంపస్ డ్రైవ్

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నన్నయ విశ్వవిద్యాలయ తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో గురువారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. 83 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ టి.అశోక్ తెలిపారు. దివిస్ లేబరేటరీస్ నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో బీఫార్మసి, ఎం ఫార్మసి, బీఎస్సీ, ఎంఎస్సీ ప్రోగ్రాం విద్యార్థుల కోసం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు.

దూబచర్ల 'డైట్'లో అధ్యాపకుల నియామకాలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దూబచర్లలోని 'డైట్'లో వివిధ విభాగాల్లో ఖాళీగావున్న 6 సీనియర్ లెక్చరర్లు, 17 లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా డిప్యూటేషన్ (ఎఫ్ఎస్‌టీసీ) ప్రాతిపదికన భర్తీ చేసే పోస్టులకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎంఈవోలు, హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ ఎం.కమల కుమారి గురువారం తెలిపారు. ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని, 16, 17 తేదీల్లో రాతపరీక్ష, 19న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. నోటిఫికేషన్ వివరాలను డీఈవో ఏలూరు వెబ్‌సైట్‌లో ఉందన్నారు.

జడ్పీ సమావేశం వాయిదా

ఏలూరు సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జడ్పీ సమావేశం, స్థాయి సంఘాల సమావేశాలు ఈ నెల 4న జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు జడ్పీ సీఈవో కె భీమేశ్వర్ గురువారం తెలిపారు. తిరిగి సమావేశం జరిగే తేదీ త్వరలో తెలియజేస్తామన్నారు.

5న భద్రాచలం బస్సులు

భీమవరం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా భీమవరం డిపో నుంచి 5న భద్రాచలంకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పీ ఎన్‌వీఎం సత్యనారాయణ తెలిపారు. 5న శనివారం కొత్త బస్ కాంప్లెక్స్ నుంచి నడుపుతాయమని, ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. టికెట్టు ధర రూ.410 నిర్ణయించామన్నారు. భక్తులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులపై కేసు

తాడేపల్లిగూడెం క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారయత్నం ఘటనపై అసత్య ప్రచారాలు చేసిన యూట్యూబ్ చానల్ నిర్వాహకులపై పట్టణ పోలీసులు గురువారం పోక్సో కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన బాలికకు జరిగిన అన్యాయంపై గత నెల 31న ఒక యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులు వీడియో ప్రసారం చేశారు. బాలిక వివరాలను బహిర్గతం చేశారు. ఆమె తండ్రి పట్టణ పోలీసులను ఆశ్రయించగా సీఐ సుబ్రహ్మణ్యం ముగ్గురిపై పోక్సో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పిచ్చి కుక్క స్వైర విహారం
8 మందికి గాయాలు

ఆచంట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి వేళల్లో ప్రధాన సెంటర్లలో సైతం కుక్కలు గుంపులు గుంపులుగా వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. ఆచంటలో గురువారం పిచ్చికుక్క స్వైర విహారంతో 8 మంది గాయపడ్డారు. వారికి సీహెచ్‌సీలో చికిత్స చేశారు. ఆచంటలో పిచ్చి కుక్కను పట్టుకుని వీధి కుక్కలను కూడా నిరోధించాలని కోరుతు ఆచంటకు చెందిన బాధితుడు సింహాచలం స్థానిక పంచాయతి కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఆంధ్రజ్యోతి
భీమవరం
భీమవరం, ఉండి, నరసాపురం, పాలకొల్లు, ఆచంట, తణుకు, తాడేపల్లిగూడెం

పైపు లీకేజీ.. తాగునీరు వృథా



ఇరగవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఇరగవరం మండలంలోని అర్జునుడుపాలెం గ్రామంలో నీటిపైపు లీకు కావడంతో తాగునీరు వృథాగా పోతున్నది. కొన్ని నెలలుగా ఇలా నీరు లీకై డ్రెయినేజీలోకి పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నీరు వృథాగా పోవడంతో శివారు ప్రాంతాలకు తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

పోడూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పోడూరులోని మండల అధికారుల కార్యాలయాలకు మంచినీటి కల్పనలో భాగంగా రూ.6లక్షలతో చేపట్టనున్న పైపులైన్ నిర్మాణ పనులకు గురువారం ఎంపీడీవో బి.మంగాకుమారి శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులు రూ.6లక్షల వ్యయంతో మంచినీటి వసతిని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ శెట్టి బత్తుల సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి కాలుష్య నివారణకు ప్రాధాన్యం

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ఆకివీడు రూరల్ ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. అయిభీమవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా చూసుకున్న రోజునే ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తారని అన్నారు. ఆరోగ్యంగా జీవించడానికి నీరు ముఖ్యమని, నీరు కలుషితమవ్వకుండా కాపాడేందుకే నియోజకవర్గంలో గెలిచిన నాటి నుంచి దాతలు, స్నేహితులు సహకారంతో కాలువలు ప్రక్షాళన ప్రారంభించినట్లు తెలిపారు. ఆక్వాచెరువుల నీరు మురుగు కాలువలోనికే వెళ్ళాలని, పంట కాలువలలోనికి వదిలితే కఠిన చర్యలు తీసుకునే విధంగా ఆదేశించినట్లు తెలిపారు. కెనరాబ్యాంకు సహకారంతో 25మైక్రో ఫిల్టర్‌లు ఏర్పాటు చేశామని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో మే 15 నాటికి మైక్రో ఫిల్టర్‌లు ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీరు అందిస్తామని తెలిపారు. జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, ఎంపీపీ కఠారి జయలక్ష్మీ, సర్పంచ్ సామ్రాజ్యం పాల్గొన్నారు.



కాళ్ళ మండలంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులతో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ఇళ్ల పట్టాల పంపిణీ

కాళ్ళ ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తానని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. వేంపాడు గ్రామానికి చెందిన 18 కుటుంబాలకు గురువారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పంట కాలువల పక్కన నిర్మించుకున్న ఇళ్లను అధికారులు తొలగించారన్నారు. వేంపాడు గ్రామంలో పంట కాలువ పక్కనే ఉన్న ఇళ్లను తొలగించిన 18 కుటుంబాలకు ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున వేరేచోట ఇళ్ల పట్టాలను అందించి వారు ఇళ్లు నిర్మించుకునేందుకు రుణం కూడా మంజూరు చేయించినట్లు తెలిపారు.

ఐటీఐ అభివృద్ధికి చర్యలు

ఉండి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఉండి ప్రభుత్వ ఐటీఐని స్కిల్ నైపుణ్య కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం ఎన్ఆర్‌పిఅగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐకి ఆమె విచ్చేసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐటీఐ అభివృద్ధికి అవసరమైన వాటిని ఏర్పాటుచేయడానికి తాము సిద్ధంగా వున్నామన్నారు. డిప్యూటి స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ ఉండి నియోజకకవర్గంలో ప్రభుత్వ ఐటీఐలన్నీ అభివృద్ధి చేయడానికి తాను ప్రణాళికను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. వెలివర్రులోని వీరపేరంటాలమ్మ ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో దాతలు, ఆలయకమిటి మాజీ చైర్మన్‌లను ఘనంగా సన్మానించారు.

వైభవంగా వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠ

అత్తిలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అత్తిలి విజయ చాముండేశ్వరి ఆలయంలో వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కందుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిపారు.

బాలా త్రిపుర సుందరికి సారె

భీమవరం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మెంటేవారితోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారికి భక్తులు సారె అందించారు. పట్టణానికి చెందిన కడియం సతీష్ కుమార్, రామ అరుణ నాగ ఫణిజ దంపతులచే అమ్మవారికి శ్రీచక్రార్చన, కుంకుమార్చన, నక్షత్ర హారతులు పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సారె అందించి భక్తులకు పంపిణీ చేశారు.

నిప్పులగుండం తొక్కిన భక్తులు



ఉండి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వెలివర్రులోని వీరపేరంటాలమ్మ ఆలయం వద్ద ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిప్పులగుండం కార్యక్రమం జరిగింది. భక్తులు అధికంగా విచ్చేసి నిప్పులగుండం తొక్కారు.

కోదండ రామాలయ పునఃప్రతిష్ఠ పూజలు



ఆకివీడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మాదివాడ కోదండ రామాలయం పునఃనిర్మాణం, పునఃప్రతిష్ఠలో భాగంగా గురువారం భక్తులు ఘనంగా యాగశాలలో ధాన్యాదివాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ రిటైర్డు చీఫ్ ఇంజనీర్ మోటుపల్లి సుబ్బారావు, కనకదుర్గాదేవి దంపతులు, టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, సీనియర్ నాయకులు మోటుపల్లి సత్యనారాయణ, మోటుపల్లి నరసింహారావు, మోటుపల్లి సుబ్బారాయుడు, శివ పాల్గొన్నారు.

అగస్త్యేశ్వర స్వామి రాజ గోపుర శిఖర ప్రతిష్ఠ



పెనుగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వడలి గ్రామంలో అగస్త్యేశ్వర స్వామి రాజగోపుర శిఖర ప్రతిష్ఠ కన్నుల పండువగా నిర్వహించారు. విశ్వనాథ శర్మ వేద మంత్రోచ్ఛణలతో వీధి శ్రీను, కోమటి నాగేశ్వరరావు, గుండాబత్తుల బాలకృష్ణ, కట్ట రామకృష్ణ, వాసా హరి ప్రసాద్ దంపతులచే శిఖరప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పితాని వెంకట్, బడేటి బ్రహ్మాజీ, బోడపాటి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

భూమిని కాపాడుకోవాలి



ఎమ్మెల్యే అంజిబాబుకు మొక్కలు అందించిన దృశ్యం

భీమవరం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం సంస్కార్ స్కూల్ విద్యార్థులు సేవ్ ట్రీస్ .. సేవ్ ఎర్త్ అనే నినాదంతో గురువారం ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు మొక్కలను అందించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు అవగాహన కల్పించడం అభినందనీయమని అన్నారు.

రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలంలోని పలు గ్రామాల్లో రూ.63 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. దూసనపూడి, మత్స్యపురి పాలెంలలో ప్రారంభించారు.



ఎన్ఎంయూ నాయకుల ఆందోళన

భీమవరం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో నైట్ అవుట్ అలవెన్స్‌లను 300 రూపాయలు చే యాలని, హయ్యర్ పెన్షన్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భీమవరం డిపోవద్ద ఎన్ఎంయు నాయకులు ఆందోళన చేశారు. గతంలో నాయకులు ఇచ్చిన సమస్యలను కూడా పరిష్కరించాలని అన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి మహిళలు ముందుకు రావాలి



ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఉద్యమిస్తే ఏ పనైనా సులభంగా సఫలీకృతమవుతుందని, ప్లాస్టిక్‌ను తరిమికొట్టడంలో మహిళలు ముందుకు రావాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్య రాజు అన్నారు. మునిసిపాలిటీ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 4,5 వార్డులలో మహిళ సంఘాలతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. మహిళా సంఘాల ప్రతినిధులు గంధం రాధ, గౌరీ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయంగా గుడ్డ సంచులనే వినియోగించాలని అన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణాలలో గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని, ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. అనంతరం 90 మందికి ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

పెనుగొండ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పెనుగొండలోని చెరుకువాడ తిలక్‌వీధిలో పంచాయతీ నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేయడానికి ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, కటికిరెడ్డి నానాజీ, వేండ్ర రాము, నక్కా వేద వ్యాస శాస్త్రి, పులిగోరు రవి, రొక్కాల సురేష్ కుమార్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో ఆరుగురు ఎంపిక

పెంటపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పెంటపాడు డీఆర్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివిస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. పలు కళాశాలల నుంచి 18 మంది హాజరు కాగా వీరిలో ఆరుగురు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

తణుకు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు చేస్తే మునిసిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం మునిసిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేసి, పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.26వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు.

వడగాడ్పులపై అప్రమత్తంగా ఉండాలి

తణుకు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వడగాడ్పులు తగలకుండా అప్రమత్తంగా ఉండాలని సబ్‌యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని కొమ్మాయి చెర్వుగట్టు, పల్లాలమ్మగుడి ఏరియాలో కీటక జనిత వ్యాధులపైన, వడదెబ్బలపైన అవగాహన కల్పించారు. వడదెబ్బకు గురికాకుండా నీళ్ళు, పండ్ల రసాలు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని చెప్పారు. దోమ చిన్నదైనా కుడితే కొన్ని సందర్భాలలో ముప్పు పెద్దదిగా ఉండే అవకాశం ఉందన్నారు.

దివ్యాంగురాలికి ప్రింటర్ అందజేత

తణుకు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలు గుమ్మలూరి దుర్గాభవానికి మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో జీవనోపాధి నిమిత్తం ప్రింటర్ కొనుగోలు చేసి అందజేశారు. గురువారం గమిని పంక్షన్ హాల్‌లో దాతలు కంచర్ల త్రినాధరావు, చేకూరి ప్రదీప్, పూసరపు నాగశివ గాంధీ ఇచ్చిన విరాళంతో కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. ఈనెల 7 నుంచి నిర్వహించే చలివేంద్రం కోసం చిట్టూరి సుజాత పదివేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శాంతి ర్యాలీ చైర్మెన్ గమిని రాంబాబు, రాష్ట్ర కన్వీనర్ డా.కోడూరి రాధాపుష్పవతి, అధ్యక్షురాలు కఠారి శారదాదేవి, బొల్లం రామకాశి, అక్కిన కాశీవిశ్వనాథం, బోయపాటి రామలక్ష్మి పాల్గొన్నారు.

రేపు భీమవరం తిరుమలలో అవగాహన సదస్సు

భీమవరం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భీమవరంలోని తిరుమల విద్యాసంస్థలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు జేఈఈ, (మెయిన్), జేఈఈ (అడ్వాన్స్), నీట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు సదస్సు జరుగుతుందన్నారు. పిల్లలు ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి కళాశాలల్లో విద్యను అభ్యసించాలంటే ఎలా సిద్ధం అవ్వాలో ఈ సదస్సులో వివరిస్తారని చెప్పారు. విద్యార్థులు, తల్లి తండ్రులు సదస్సును సద్వినియోగంచేసుకోవాలన్నారు. వివరాలకోసం 99513 94083, 99513 94087 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కిడ్నీ బాధితురాలికి పింఛన్ అందజేత

ఇరగవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఓగిడి గ్రామంలో కిడ్నీ డయాలసిస్ చికిత్స పొందుతున్న బాధితురాలు పిల్లి సత్యవతి కుటుంబానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ రూ. 10 వేల పెన్షన్ అందజేశారు. సత్యవతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

నేడు ఎ.ఎస్.ఎన్.ఎం. కళాశాల వార్షికోత్సవం

పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎ.ఎస్.ఎన్.ఎం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల 58వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఎస్.శోభారాణి హాజరవుతారని వివరించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పోడూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిన్నూరు నరసరాజ్‌నగర్‌లో గురువారం 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏరియాలో లోవోల్టేజి సమస్య తీరనుందన్నారు. కార్యక్రమంలో పాలకొల్లు డీసీ వైస్‌చైర్మన్ దేవళ్ల శ్రీరామకోటి మోహన్, మట్టపర్రు నీటిసంఘం అధ్యక్షుడు కుక్కల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ దాసరి రత్నరాజు, మాజీ ఉపసర్పంచ్ గుబ్బల శ్రీరామ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆకివీడు రూరల్ ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గుమ్ములూరు గ్రామంలో ఉమర్ ఆలీషా పీఠం వారిచే చలివేంద్రాన్ని పీఠం సభ్యులు పెన్మెత్స వెంకటరాజు గురువారం ప్రారంభించారు. ప్రతిఏటా వేసవి కాలంలో ఈ గ్రామంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మజ్జిగదాహం తీరుస్తారని నిర్వాహకులు తెలిపారు.

వృద్ధులను వారసులు వేధిస్తే ఫిర్యాదు చేయండి

భీమవరం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) :వయో వృద్ధుల రక్షణ, పోషణ చట్టం ప్రకారం ప్రతి రెవెన్యూ డివిజన్ స్థాయిలోనూ కేసుల పరిష్కారించడానికి ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేశారని ఆర్డీవో మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. ట్రిబ్యునల్‌కు వచ్చే కేసులను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ రెండవ సమావేశం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రతివారం జరిగే పి.జి.ఆర్.ఎస్‌కు సీనియర్ సిటిజన్స్ నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. వృద్ధుల్ని వారి పిల్లలు వేధిస్తున్నట్లైతే రెవెన్యూ డివిజన్ అధికారికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



వారతిప్పలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

మొగల్తూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలు దృష్ట్యా ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. కొత్తోట, వారతిప్ప గ్రామాల్లో ఉపాధి పనులను, ముత్యాలపల్లిలో బీసీ బాలిక వసతి గృహన్ని, అదే గ్రామంలోని గెదళ్ళవంపు గ్రామంలో జగనన్న కాలనీ నిర్మాణాలను, మొగల్తూరులో డంపింగ్ యార్డ్ నుంచి రవాణా అవుతున్న చెత్తను ఆమె గురువారం పరిశీలించారు. ముందుగా వారతిప్ప గ్రామంలో పంట కాలువలో పేరుకు పోయిన చెత్తను తొలగించే ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలకు పని చేసే ప్రాంతంలో మంచినీటి సౌకర్యం కల్పిం చాలని, టెంట్ ఏర్పాటు చేయాలని సూచిం చారు. అనంతరం ముత్యాలపల్లి బీసీ బాలి కల వసతి గృహన్ని సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా ఆహార పదార్థాలు రుచికరంగా ఉంటున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొగల్తూరు జాతీయ రహదారి, చెరువుల వద్ద డంప్ చేసిన చెత్తా చెదారాలను పరిశీలించారు.

ఆక్వాలో సాంకేతికతపై అవగాహన ఉండాలి: జేసీ

భీమవరం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా సాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో మత్స్యశాఖపై అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా సాగులో రైతులు అనుసరిస్తున్న సాంకేతిక పద్ధతులు, వినియోగిస్తున్న నూతన యంత్రాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఆక్వా ఎక్స్ఛేంజ్, కౌంట్ 366 సంస్థలు ఉపయోగిస్తున్న అధునాతన పరికరాలు అయిన పవర్ మాన్, స్టార్టర్స్ ఆక్వా బోర్డు వాటి నిర్వహణ గురించి ఆ సంస్థ ప్రతినిధులు జాయింట్ కలెక్టరుకు, మత్స్యశాఖ అధికారులకు వివరించారు. యంత్ర పరికరాల వాడటం వల్ల విద్యుత్ ఆదాపై జిల్లాలో పది మంది రైతుల మీద పరిశీలన చేసి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఆక్వాసాగు విస్తీర్ణం 1,33,037 ఎకరాలకు గాను50,732ఎకరాలు మాత్రమే ప్రభుత్వం ద్వారా రిజిస్టర్ అయ్యాయని తెలిపారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ



యలమంచిలి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు పేర్కొన్నారు. గుంపర్రు గ్రామంలో తహసీల్దారు జి.పవన్ కుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన రీసర్వే అవగాహన సదస్సు, ర్యాలీలో ఆర్డీవో దాసి రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పారదర్శకమైన భూ రికార్డులను రూపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం రీసర్వే చేపడుతోందని వివరించారు. సర్పంచ్ తుంగ అమూల్య, కూటమి నాయకులు చిట్టూరి ఆంజనేయులు, జడ్డు రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దారు డేవిడ్‌సన్, ఆర్ఐ యశోద పాల్గొన్నారు.

దండు మారెమ్మకు అనంతకోటిరాజు పూజలు



అమ్మవారి ఆలయంలో అనంతకోటిరాజు, తదితరులు

గణపవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాజు వేగేశ్న ఫౌండేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్, ప్రవాసాంధ్రుడు వేగేశ్న అనంతకోటిరాజు గురువారం గణపవరంలోని శ్రీదండు మారెమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు కాకర్ల విష్ణు శ్రీనివాసరావు ఆధ్వర్య ంలో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గణపవరం తన జన్మభూమి అని మరిచిపోలేనని తమ గ్రామాభివృద్ధికి రూ.50కోట్లు విలువ గల అభివృద్ధికి కార్యక్రమాలకు శుక్రవారం ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అనంతకోటి రాజు తెలిపారు.

సకాలంలో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తాం



మాధవరంలో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బొలిశెట్టి, తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మోదుగగుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ రైతులకు ఏ ఇబ్బంది లేకుండా వారి దగ్గర ప్రతి గింజా కొన డమే కాకుండా సకాలంలో వారి ఖాతా ల్లో ధాన్యం సొమ్ము జమ చేస్తామ న్నారు. జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తమ ధాన్యం ఏ మిల్లుకు విక్రయించాలో వారే నిర్దేశించు కునే హక్కు ఉందని అన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించారు. బీజేపి జిల్లా కన్వీనర్ ఈతకోట తాతాజీ, జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరావు పాల్గొన్నారు. అనంతరం నవాబుపాలెం, జగన్నాథపురం, మాధవరం, అప్పారావుపేట, ఉప్పరగూడెం, మెట్టఉప్పరగూడెంలో సీసీ రోడ్లు, బీటి రోడ్లను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు.

శాస్త్రికి ఉద్యోగ విరమణ సత్కారం



భీమవరం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రణాళిక విభాగంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేసిన పెండ్యాల శివ రామశాస్త్రి (పి.యస్.ఆర్‌శాస్త్రి) ఉద్యోగ విరమణ చేశారు. పీఎస్ఆర్ శాస్త్రి దంపతులను మున్సిపల్ కార్యాలయం హాల్లో సత్కారం, వీడ్కోలు సభ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమిషనర్ రామచంద్ర రెడ్డి, రాష్ట్ర మునిసిపల్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సుదా బత్తుల కృష్ణమోహన్, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

వేసవిలో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

డాక్టర్ డి.భువన, సీహెచ్‌సీ సూపరింటెండెంట్



- **వేసవిలో ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి?**

జవాబు: మధ్యాహ్నం 12 గంటలు లోపు బయట పనులు ముగించుకోవాలి. ఎండలో తిరగకూడదు. ఎండలో బయటకు వెళ్లాలంటే టోపీ, గొడుగు వంటి ధరించాలి. రోజుకు 3 లీటర్లు మంచినీరు తాగాలి.

- **ఎటువంటి ఆహారం తీసుకోవాలి?**

తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారాలు తీసుకోవాలి. మసాలాల ఆహారాలు వద్దు

- **ఎలాంటి పానీయాలు తీసుకోవాలి?**

ఎండ నుంచి ఉపశమనానికి తరచూ నిమ్మకాయ, మజ్జిగ, బార్లీ గింజల నీళ్ల వంటి తదితర పానీయాలు తీసుకోవాలి

- **వడదెబ్బకు గురికాకుండా ఉండాలంటే ఏమి చేయాలి?**

అందుబాటులో ఓఆర్ఎస్ లేకపోతే నీళ్లలో నిమ్మకాయ, ఉప్పు, పంచదార తగినంత కలుపుకొని తీసుకోవాలి.

- **వడదెబ్బ తగిలితే మందులు వాడవచ్చునా?**

వడదెబ్బ తగిలినా, తగలకపోయినా బీపీ, సుగర్, థైరాయిడ్, గుండెకు సంబంధించిన మందులు యథావిధిగా వాడాలి.

- ఆకివీడు, ఆంధ్రజ్యోతి

సోపానం ఇంటర్వ్యూలు

ఆకివీడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలకు అభ్యర్థులు పోటెత్తారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకుల అధికారులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని పన్నెండు పంచాయతీలతో పాటు నగర పంచాయతీకి సంబంధించి సుమారు 1475 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

మొగల్తూరు: స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు గురువారం ప్రారంభించారు. రెండు రోజులు పాటు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. సుమారు 2765 మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు.

మందాలమ్మ ఆలయానికి విరాళం

పెనుగొండ, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): వడలి గ్రామ దేవత మందాలమ్మ అమ్మవారికి వెండి పూసల కోసం తణుకు పట్టణానికి చెందిన గంగా రామకృష్ణ (టీచర్) రూ.10,400 ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసాపురం రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): లక్ష్మణేశ్వరం, ధర్బరేవు, రాజుల్లంక గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుకుమార్ తెలిపారు. వైర్లకు అడ్డంగా ఉన్న మొక్కలు తొలగింపు పనులు చేపడుతున్నందున సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

పెంటపాడు: పెంటపాడు మండలంలోని జట్లపాలెం, మౌంజీపాడు, ఉమామహేశ్వరం గ్రామాలలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ కే.నరసింహమూర్తి తెలిపారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహమూర్తి తెలిపారు. మెయిన్‌రోడ్డు, నల్లజర్ల రోడ్డు, భూపాల్ నగర్, స్టేషన్ రోడ్డు, సిపాయిపేట, కోతిబొమ్మ సెంటర్, జూబ్లీరోడ్డు, గణేష్ నగర్, కొండాలమ్మ గుడి రోడ్డు, శశి కళాశాల రోడ్డు, వీకర్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, సత్యవతి నగర్, ఏరియాలకు విద్యుత్ ఉండదని తెలిపారు.

తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలి

కాళ్ళ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి చెత్త నుంచి సంపదను సృష్టించాలని డీపీఆర్సీ టీమ్ మెంబర్ ఎడ్వర్డ్ అన్నారు. ఏలూరుపాడులో చెత్త నుంచి సంపద సృష్టిపై శిక్షణ తరగతులను గురువారం నిర్వహించారు. కార్యదర్శులకు, క్లాప్ మిత్రాస్‌లకు డీపీఆర్సీ వారిచే శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతి రాజు వెంకట జగ్గరాజు, ఉప సర్పంచ్ నల్లగచ్చు ధనలక్ష్మి, ఎంపీటీసీ చిన్నాపరపు రాంబాబు, ఈవోపీఆర్‌డీ ఎంవి భాస్కరరావు, కార్యదర్శి ఎస్.అరుణారెడ్డి పాల్గొన్నారు.

సెలవుపై తహసీల్దార్ రాజరాజేశ్వరి

నరసాపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నరసాపురం తహసీల్దార్ రాజరాజేశ్వరి సెలవుపై వెళ్లారు. అనారోగ్యం కారణంగా ఆమె సెలవుపై వెళ్లినట్లు కార్యాలయ వర్గాలు చెబుతున్నారు. ఇన్‌చార్జిగా ఇంకా ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న అయితం సత్యనారాయణకు తాత్కాలికంగా ఇన్‌చార్జి ఇస్తారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆయన నరసాపురం, పాలకొల్లులకు సివిల్‌సప్లై డీటీగా వ్యవహరిస్తున్నారు.